# రజతోత్సవ భవ్య దీప్తితో ఏపిమాస్ !



CELEBRATING 25 apmas EMPOWERING COMMUNITIES SILVER JUBILEE Estd: 2001




MAHILA SADHIKARATHA

apmas

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

సంపుటి :24 సంచిక:11 రంగారెడ్డి జులై 2026 పేజీలు : 36 వెల : రూ. 10/-


## ఏపిమాస్‌కు ప్రాణప్రతిష్ఠచేసిన ప్రాతఃస్మరణీయులు!



విజయ్ మహాజన్



కొప్పుల రాజు



పి కోటయ్య (తొలిచైర్మన్)



సి ఎస్ రెడ్డి (వ్యవస్థాపక సి ఇ ఓ)



కె మాధవ రావు (ప్రస్తుత చైర్మన్)



ఎస్ పి టకర్



నందితా రే





నాడు

తొలి 'వెలుగు' : ఏపిమాస్ తొలినాళ్ళలో ఎన్‌జి ఓల రాష్ట్ర స్థాయి సమావేశ నిర్వహణ



నేడు

తాజా మలుపు: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖతో ఎఫ్ పి ఓల బలోపేతంపై ఒప్పందం

## అభినందనలు, శుభాకాంక్షలు!



జయేష్ రంజన్



జి ఆర్ చింతల



సుశీల చింతల



అనితా రామచంద్రన్



జనార్దనరెడ్డి



ఉదయ్ భాస్కర్

## ఏపిమాస్ ప్రధాన కార్యాలయం

సుస్థిరాభివృద్ధి సంకేతం





నాబార్డ్ సౌజన్యంతో ....

NABARD

## ఏపిమాస్ రజతోత్సవ ప్రత్యేక సంచిక

# నేల ఆరోగ్యం - ఉత్పాదకత పెంపుదల

ఆరోగ్యంగా ఉన్న నేలకు ప్రతికూల పరిస్థితులను తట్టుకునే బలం ఉంటుంది
నేల ఆరోగ్యంగా ఉండాలంటే, అందులో తగినంత సేంద్రియ పదార్థం ఉండాలి

## చేపట్టే పనులు



లోతుగా దుక్కులు దున్నడం



మల్చింగ్



పొలంలో పచ్చి రొట్ట ఎరువు సాగు



వైవిధ్య పంటల సాగు



చెరువు మట్టి చల్లడం



పంటలమార్పిడి



జీవ ఎరువుల వాడకం



నాణ్యమైన విత్తనాల వాడకం

NABARD

# మహిళా సాధికారత

సంపుటి 24 సంచిక 11



సంపాదకీయం

## సమాజ హితానికి పునరంకితం !

**అ**నంత కాల ప్రవాహంలో 25 సంవత్సరాల కాలం మహాసముద్రంలో చిన్ని నీటి బిందువు లాంటిది కావచ్చు. కాని, మానవ జీవన ప్రమాణంలో లేదా ఒక సంస్థ ప్రస్థాన క్రమంలో 25 ఏళ్ళ కాలం చిన్నదేమీ కాదు. అందునా, అది ప్రారంభ దశలోనైతే సానుకూలంగానో, ప్రతికూలంగానో మరెంతో కీలకం. ఇప్పుడు ఏపిమాస్ 25 సంవత్సరాలు పూర్తిచేసుకుని, 26 వ సంవత్సరంలో ప్రవేశిస్తున్న శుభ తరుణాన, ఒక్కసారి వెనుదిరిగి చూస్తే, గడచిన కాలాన్ని గుర్తుచేసుకుంటే, ఎన్నో అనుభూతులు, అనుభవాలు మనసులో మెదులుతాయి. సమస్యలు, సవాళ్ళు, అడ్డంకుల వంటివి సర్వసాధారణమే. కాని, వాటన్నిటిని అధిగమించి, చెప్పుకోదగిన సత్ఫలితాలను సాధించడం సంతృప్తిని కలిగిస్తుంది. ఆశయాలు, ఆశయ సాధన మార్గాలు పరిస్థితులకు అనుగుణంగా కొన్ని మార్పుచేర్పులకు గురికావలసి వచ్చినా, ఏపిమాస్ అశించే అంతిమ గమ్యంలో, పాటించే విలువలలో , అంకిత భావంలో ఈ 25 ఏళ్ళలో ఏ కొద్దిపాటి వ్యత్యాసంకూడా లేదు. ఏ రూపంలోనైనా, సమాజ హితమే ఏపిమాస్ అభిమతం! ప్రధానంగా మహిళా సాధికారతతో కూడిన పేదరిక నిర్మూలన ఏపిమాస్ ఆశించే మహదాశయం, చేరుకోవాలనుకునే అంతిమ గమ్యం! ఏ ప్రాజెక్టులను చేపట్టినా, ఏ కార్యక్రమాలను నిర్వహించినా, ఏ ఆలోచన చేసినా, ఏ వ్యూహాన్ని అనుసరించినా ఈ ఫలితంకోసమే. మహిళా సాధికారత అయినా, పేదరిక నిర్మూలన అయినా వ్యక్తిగతంగా, కుటుంబపరంగా, సామాజికంగా,అనేకానేక బాహ్యాంతర పరిణామాలతో కాని కొంతలోకొంత ఆయినా సాధ్యంకావు. మహిళా స్వయంసహాయ సంఘాలను సువ్యవస్థీకృతంచేసి, సుస్థిరాభివృద్ధి పథంలో ముందడుగు వేసేలా చూడడంతో మొదలైన ఏపిమాస్ సేవా కార్యక్రమాలు, స్వయం నియంత్రణ ఉద్యమాన్ని చేపట్టినా, మాతాశిశు ఆరోగ్య సంరక్షణ, పోషకాహార లోప నివారణ, నీరు, పారిశుధ్యం, జీవనోపాధుల పెంపుదల, గ్రామీణ వ్యాపారాల ప్రోత్సాహం, బంగారు కుటుంబాలకు చేయూత, వాటర్ షెడ్ల నిర్వహణ, పాడిపంటలు, వాతావరణ హిత గ్రామాలు, ఎఫ్ పి ఓల అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటు, విద్యాలయాలలో మౌలిక వసతుల కల్పన ... యిలా ఏ ప్రాజెక్టు చేపట్టినా అవి అన్నీ , ముందే ప్రస్తావించిన ఏపిమాస్ అంతిమ గమ్యానికి అనుగుణమైనవే, దోహదం చేసేవే. క్లుప్తంగా యిదీ ఏపిమాస్ సేవా పథం ఆంతర్యం! ఏపిమాస్ 25 సంవత్సరాల లేదా రజతోత్సవ వేడుకల సందర్భం, ఏపిమాస్ వ్యవస్థాపక సి ఇ ఓగా నాకు ఎంతో వినమ్రతను కలిగించే క్షణంగా భావిస్తున్నాను. గత 25 సంవత్సరాలుగా నేను ఇక్కడ ఉన్నాను. ఈ 25 సంవత్సరాల ప్రయాణం నేర్చుకునే ప్రయాణం, ఉత్సాహభరితమైన ప్రయాణం, సంతృప్తిని ఇచ్చిన ప్రయాణం. ఎందుకంటే ఈ ప్రయాణం ప్రభావవంతంగా సాగింది, ఈ 25 సంవత్సరాలుగా సంస్థకు నాయకత్వం వహిస్తూ, ముఖ్యంగా ఏపిమాస్ మహదాశయానికి, దార్శనికతకు, లక్ష్యాలకు గాఢంగా కట్టుబడిన డైరెక్టర్ల బోర్డుతో కలిసి పనిచేసే అవకాశం నాకు లభించింది.వారందరూ ఏపిమాస్‌ను భారతదేశంలో ఒక విలువైన, విశ్వసనీయ సంస్థగా తీర్చిదిద్దడంలో అపారమైన సహకారం అందించారు. ఈ 25 సంవత్సరాల ప్రయాణంలో, సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓగా నేను బోర్డు మరింత బలంగా, మరింత చురుకుగా, మరింత సహాయకారిగా మారడాన్ని చూశాను.ఈ ప్రయాణంలో యిటు ఏపిమాస్ పాలకవర్గం మార్గదర్శనం, తోడ్పాటుతో పాటు, ఎన్నెన్నో సంస్థలు, వ్యవస్థలు, ఎందరెందరో అధికారులు, అనధికారులు, భాగస్వాములు, దాతృత్వ సంస్థలు, శ్రేయోభిలాషులు అందించిన సహాయం, సలహా సంప్రతింపులు ఎన్నటికీ మరువలేనివి. వారందరికి శతాధిక ధన్యవాదాలు. ఈ 25 ఏళ్ళలో వందమందికి పైగా పాలకవర్గ సభ్యుల మార్గదర్శనాన్ని ఏపిమాస్ పొందగలిగింది. దాదాపు 900 మంది ఉద్యోగులతో ఏపిమాస్ అనుబంధాన్ని కలిగివుంది. అంకిత భావంతో పనిచేసే సిబ్బంది తోడ్పాటు ఏపిమాస్ వేసిన ప్రతి అడుగులో, చేపట్టిన ప్రతి కార్యక్రమంలో స్పష్టంగా కనిపిస్తుంది. బాధ్యతను మించి వారందించిన ఆత్మీయ సహకారాన్ని ఏ కొలమానంతో కొలవగలం? నేర్చుకున్న ఈ అనుభవం, సాధించిన ఈ ప్రగతి అందిస్తున్న ఆత్మవిశ్వాసంతో , ధైర్యస్థైర్యాలతో సమాజహితంకోసం ప్రగతి పథంలో మరెన్నో ముందడుగులు వేయడానికి ఈ చిరస్మరణీయ సందర్భంలో ఏపిమాస్ పునరంకితమవుతున్నది. ఆశీర్వదించండి, అండగా నిలవండి. కలసి మెలసి మరింత మెరుగైన సమాజాన్ని ప్రపంచానికి కానుకగా యిద్దాం!

టి. చంద్రశేఖర రెడ్డి

**Edited, Printed, Published and owned by T.Chandra Sekhar Reddy; Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No.CFC-1&2, Survey No.18, E-city, SEZ, General Industrial Park, Raviryal and Srinagar, Maheswaram, Ranga Reddy District, Telangana - 501359 and Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally, Manikonda,Ranga Reddy District,Telangana-500089. Editor:T.Chandra Sekhar Reddy**

ముందు నీవేమిటో తెలుసుకో, ఆపై నిన్ను నీవు మలుచుకో ; నీ సృష్టికర్తవు నీవే !

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. కృష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి: **జి. శ్రీనివాస్, ఎల్. భవాని, ఆర్ రమాదేవి, ఎం. భార్గవి, కె శ్రీనివాస్, ఆర్ బ్రహ్మాచారి**

**కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి , కన్సల్టెంట్ : కె. రఘురామరాజు**

**సాంకేతిక సహకారం: క్రిస్టోఫర్ వసంత్**

**లోపలి పేజీలలో ....**


- సంఘటిత స్వయంశక్తి ప్రేరణకర్తగా పావు శతాబ్ది! 05
- పి 4 ఫలాలు అందుకుంటున్న 'బంగారు కుటుంబాలు' 09
- పారిశుధ్యం, పరిశుభ్రతను పెంచే 'వాష్' ప్రాజెక్ట్ 10
- మాతాశిశు ఆరోగ్యం, పోషకాహారం ప్రాజెక్టు 11
- సమాఖ్యల సుస్థిరాభివృద్ధికి స్వయం నియంత్రణ ఉద్యమం! 13
- వ్యవసాయం, ఉద్యాన రంగాలపై ప్రత్యేక దృష్టి 14
- రజతోత్సవ శుభాకాంక్షల సుమగంధం! 15
- 25 వసంతాలు ... 25 కీలక ఘట్టాలు! 18
- ఆహార, పశుగ్రాస భద్రతను పెంచే 'పాడి పంటలు' 21
- రాయలసీమ జలవనరుల అభివృద్ధి కార్యక్రమం 22
- వ్యవసాయ రంగంలో మహిళల సాధికారత ఆజీవ! 23
- ఏపిమాస్ పాలక వర్గం .... నాటి నుంచి నేటి వరకు 24
- ఏపిమాస్ సంస్థ ఉద్యోగులు ... నాటి నుంచి నేటి వరకు 27


## 'మహిళాభివృద్ధి సొసైటీ' (ఏపిమాస్)

'మహిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశంలోని ఇతర అనేక రాష్ట్రాలలో మహిళా స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పని చేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతో పాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం 'మహిళా సాధికారత' పత్రికతో పాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.


| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | | |
|---|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : | రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : | రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : | రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**


మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org

ఆశాభావం అన్నిటినీ అనుకూలంగా మార్చే మంత్రదండం కాదు, దేనికైనా నిన్ను సిద్ధంచేసే మనోబలం !

# సంఘటిత స్వయంశక్తి ప్రేరణకర్తగా పావు శతాబ్ది!

**స్వావలంబన సంస్థలకు చేయూతనిస్తూ, సాధికార జీవితాలను ఆవిష్కరిస్తూ ఏపిమాస్ విజయ ప్రస్థానం**

– జె వి క్రిష్ణమూర్తి

పరస్పర సహాయంతో కూడిన సంఘటిత స్వయంశక్తి ప్రాతిపదికగా మహిళలకు, పేదలకు, గ్రామీణులకు, పట్టణ పేదలవాడల వారికి, రైతులకు, విద్యార్థులకు, ప్రగతి పథ సహభాగస్వామ్య బంగారు కుటుంబాలకు తమ సంస్థల గురించి, తమ జీవనోపాధులను మెరుగుపరచుకునే మార్గాల గురించి, అదనపు బ్రతుకుదెరువులను ఏర్పాటు చేసుకునే




అవకాశాల గురించి, తమ కుటుంబ సభ్యుల ఆరోగ్య సంరక్షణకు అనుసరించవలసిన పద్ధతుల గురించి, తమ ఉనికికి, అభ్యున్నతికి మూలమైన తమ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా , తమ విద్యాసంస్థలను ఉత్తమ విద్యాబోధనకు అనువైన విజ్ఞాన కేంద్రాలుగా తీర్చిదిద్దుకునే విధానాల గురించి, ప్రభుత్వ-ప్రైవేటు-ప్రజా ఉమ్మడి భాగస్వామ్యం ద్వారా పేదరిక నిర్మూలనకు సాగుతున్న బృహత్ కార్యక్రమం గురించి సరైన అవగాహన కలిగిస్తూ, వారిలోని నైపుణ్యాలను వెలికితీసి, వాటికి మెరుగులు దిద్దుతూ, నిర్దిష్టమైన గమ్యంతో, విస్పష్టమైన గమనంతో స్వచ్ఛంద సేవారంగంలో 25 సంవత్సరాల ప్రస్థానాన్ని ఫలప్రదంగా పూర్తిచేసుకుని, తాను చేపడుతున్న అన్ని రంగాలలో మరింత ప్రభావోత్పాదకంగా కృషిచేయాలన్న ప్రగాఢ సంకల్పంతో 26 వ వసంతంలోకి అడుగుపెడుతున్నది 'ఏపిమాస్ 'అనే చిరునామంతో పిలువబడే 'మహిళా అభివృద్ధి సొసైటీ , ఆంధ్రప్రదేశ్ '!

స్వయంసహాయ బలాన్ని చాటిచెప్పి, పేదలను ముఖ్యంగా మహిళలను పేదరికంనుంచి బయటకు తేవాలన్న తపన, ఆ ఆశయాన్ని నెరవేర్చుకోవడానికి ఎంచుకున్న మార్గం పట్ల అఖండ విశ్వాసం... బహుశ ఈ ప్రధాన చోదకశక్తులే 'మహిళా అభివృద్ధి సొసైటీ'ని 25 ఏళ్ళ క్రితం 2001 జులై ఒకటవ తేదీన మొదటి ముందడుగు వేయించాయి. మరిన్ని అడుగులకు దన్నుగా నిలిచాయి. మహిళాభివృద్ధితో మొదలైన ప్రస్థానం క్రమేణా గ్రామాభివృద్ధి, పట్టణాభివృద్ధి, పర్యావరణాభివృద్ధి, వ్యవసాయాభివృద్ధి, విద్యాభివృద్ధి, ఆరోగ్యాభివృద్ధి, సామాజికాభివృద్ధి ... యిలా 'మహిళాభివృద్ధి సొసైటీ' గమనం వివిధ రంగాల సమగ్రాభివృద్ధి దిశగా సాగుతున్నది. ఆశయానికి తోడు అనుభవం నేర్పిన పాఠాలు, ప్రతి సమస్యకు సానుకూల పరిష్కారాన్ని అన్వేషించి, అనుసరించే నేర్పు ఈ సంస్థకు మరింత వాస్తవిక దృక్పథాన్ని, క్షేత్రస్థాయిలో మరింత ప్రభావోత్పాదకంగా కార్యక్రమాలను నిర్వహించగలిగిన ఓర్పును, నైపుణ్యాన్ని అందించాయి. అందుకే ఈ సంస్థ గమనంలో అంతటి విజయం, సేవలకు అంతటి ఆదరణ! అంతటి నమ్మకం!

ప్రతి మనిషీ తన నోటిలో దాగి వుంటాడు. ఎదుటివారికి నీవేమిటో తెలియాలంటే నీ నోరు విప్పవలసిందే

## ఎస్ హెచ్ జి సమాఖ్యలకు పురస్కారాలు

నాబార్డ్, ఎస్‌బీఐ, తదితర సంస్థల భాగస్వామ్యంతో అత్యుత్తమ స్వయం సహాయ సమాఖ్యలను సత్కరించే జాతీయ స్థాయి పురస్కారాలను 2021లో ప్రారంభించింది. ఇప్పటి వరకు 5 పర్యాయాలుగా ఈ సత్కార మహా సమ్మేళనాలను నిర్వహించి, 13 రాష్ట్రాలకు చెందిన 54 అత్యుత్తమ స్వయం సహాయ సమాఖ్యలకు అవార్డులను అందించింది.

### నేపథ్యం

1990 దశకం చివరి సంవత్సరాలలో, అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం స్వయంసహాయ సంఘాల మహిళలకు తగిన రుణ సదుపాయం కల్పించడానికి ఒక బ్యాంకును ఏర్పాటు చేయాలని భావించింది. ఇందుకు అవసరమైన నియమ నిబంధనలను రూపొందించడానికి నాబార్డ్ ఛైర్మన్ గా పదవీ విరమణ చేసిన శ్రీ పమిడి కోటయ్య నాయకత్వంలో, ఐ ఏ ఎస్ అధికారులు శ్రీ యుగంధర్, శ్రీ ఎస్ పి టకర్ , బేసిక్స్ వ్యవస్థాపకులు శ్రీ విజయ్ మహాజన్, డాక్టర్ నందితా రే, కేర్ ఇండియా ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ శ్రీ సి ఎస్ రెడ్డి తదితర నిపుణులతో కూడిన ఒక ఉన్నత స్థాయి సలహా సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ సంఘం వివిధ ప్రతిపాదనలను కూలంకషంగా పరిశీలించి, స్వయంసహాయ మహిళలకు రుణ సహాయంతో పాటు, సామర్థ్యం పెంపు కార్యక్రమాలను కూడా నిర్వహించడం ఎంతైనా అవసరమని, ఇందుకోసం అప్పుడే ఏర్పాటైన 'గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ' (సెర్ప్) తో కలసి పనిచేయగల ఒక సంస్థను ఏర్పాటు చేయాలని తీర్మానించాయి. ఆ తీర్మానానికి అనుగుణంగా శ్రీ పమిడి కోటయ్య ఛైర్మన్ గా, శ్రీ సి ఎస్ రెడ్డి ముఖ్య కార్య నిర్వహణాధికారిగా 'మహిళాభివృద్ధి సొసైటీ–ఆంధ్రప్రదేశ్' (ఏపిమాస్) 2001 జులై 1 వ తేదీన అధికారికంగా ఆవిర్భవించింది.

### దార్శనిక పాలకవర్గం

నాబార్డ్ విశ్రాంత అధ్యక్షులు శ్రీ పమిడి కోటయ్య అధ్యక్షతన తొలి పాలకవర్గం ఏర్పాటు కాగా, తర్వాత కొంతకాలానికే శ్రీ కోటయ్య స్వచ్ఛందంగా పదవీ విరమణ చేశారు. అనంతరం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రధాన కార్యదర్శిగా పదవీ విరమణ చేసిన శ్రీ కాకి మాధవరావు ఏపిమాస్ పాలకవర్గం అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. వ్యవస్థాపక సి ఇ ఓ గా బాధ్యతలు చేపట్టిన నిత్యచైతన్య శీలి, నిర్వాహణదక్షుడు, ఈ రజితోత్సవ ప్రస్థాన ప్రధాన కార్య నిర్వాహకుడు శ్రీ సి ఎస్ రెడ్డి ఈ 25 ఏళ్ళుగా ఏపిమాస్ సారథ్య బాధ్యతలు వహిస్తున్నారు. ఏపిమాస్ యింత సమర్థంగా, యింతటి ప్రభావోత్పాదక సంస్థగా ఎదగడానికి

### ఏపిమాస్ మహదాశయం (విజన్)-2030

అట్టడుగువర్గాలకు చెందిన మహిళల, రైతుల,స్థానిక సామాజిక వర్గాల నేతృత్వంలో, వారి సామాజిక, ఆర్థిక పురోగతికి దోహదంచేస్తూ, స్వావలంబనతో, అభివృద్ధిపథంలో పనిచేసే సంస్థలకు వివిధ రకాల సేవలను , సానుకూల జీవనోపాధులను అందించే సమన్వయకర్తగా ఏపిమాస్ ఆవిర్భావం.

### ఆశయ సాధన మార్గం (మిషన్)

2030 నాటికి ఏపిమాస్ బహుళ వాటాదారుల భాగస్వామ్యంలో నవీకరణలను, సుస్థిర జీవనోపాధులను సమకూర్చే సంస్థాగత నమూనాలను పరిచయంచేస్తూ, క్రమబద్ధమైన పరివర్తనకోసం కృషిచేసే అత్యాధునిక వనరుల సంస్థగా 10 లక్షలకుటుంబాలను ఈ క్రింది విధంగా ప్రభావితం చేస్తుంది:

- సహ భాగస్వామ్యంలో నాణ్యతపరంగా అత్యున్నత ప్రమాణాల, కొలమానాల రూపకల్పన, ప్రోత్సాహం
- శక్తిసామర్థ్యాల పెంపుదల
- జీవావరణ సేవలు, సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థికం, మార్కెట్, తదితర మౌలిక వనరుల అందుబాటు
- మహిళల నాయకత్వంలో పనిచేసే సంస్థలకు, విభిన్న సామాజిక సంస్థలకు మధ్య అనుసంధానం
- రుజువులతో కూడిన విధానపర మార్గదర్శనం

### ప్రామాణిక పరిశోధనలు

88 పరిశోధన అధ్యయనాలు, 75 అంశాల వారీ ప్రచురణలు, స్వయం సహాయక సంఘాలపై మూడు ప్రామాణిక గ్రంథాలను వెలువరించి, రాష్ట్ర జాతీయ విధాన రూపకల్పనకు ఏపిమాస్ ఆధారంగా నిలిచింది.

నిబద్ధతతో, అంకితభావంతో, దార్శనికతతో వ్యవహరించే పాలకవర్గపు ఆచరణాత్మక, క్రియాశీల మార్గదర్శకత్వం ఎంతో కీలకమైనది. సంబంధిత వివిధ రంగాలకు చెందిన నిపుణులు, మేధావులు, శాస్త్రవేత్తలు, బ్యాంకర్లు, ప్రభుత్వ ఉన్నతోద్యోగుల వంటి బహుముఖ ప్రజ్ఞావంతుల కొలువుపీఠం ఈ పాలకవర్గం.

**అన్ని రాష్ట్రాలలో, విదేశాలకు కూడా ...**

సెర్ప్, మెప్మా, నాబార్డ్ తదితర సంస్థల తోడ్పాటుతో, డి ఎఫ్ ఐ డి, జి ఐ జడ్, డి జి ఆర్ వి, ఫోర్డ్‌ఫౌండేషన్ వంటి సంస్థల ప్రోత్సాహంతో, కొన్ని ఇతర భాగస్వామ్య సంస్థల సహకారంతో మనదేశంలో దాదాపు అన్ని రాష్ట్రాలకు ఏదో ఒక రూపంలో తన సేవలను అందించిన ఖ్యాతి 'మహిళా అభివృద్ధి సొసైటీ'ది . ఇంతేకాదు బంగ్లాదేశ్, కెనడా, ఇథియోపియా, జర్మనీ, కెన్యా, మైనమార్, థాయ్‌లాండ్, యునైటెడ్ కింగ్‌డమ్, వియత్నాం వంటి విదేశాలు కూడా ఏపిమాస్ సేవలను పొందినవే!

**లక్షలాది కుటుంబాలకు తోడ్పాటు!**

గ్రామీణ స్వయంసహాయ సంఘాలకు శిక్షణ యిచ్చి వాటి నిర్వహణ తీరును మెరుగుపరచడం, వాటి పనితనాన్ని, సామర్థ్యాన్ని బేరీజువేసి, నిగ్గుతేల్చి, ఏ స్వయంసహాయ సంఘం లేదా సమాఖ్య స్థాయి ఏమిటో నిర్ణయించడంతో మొదలైన ఏపిమాస్ సేవారంగం ఆ తర్వాత పట్టణాలకు విస్తరించింది. వాటర్‌షెడ్‌లు, సహజ వ్యవసాయం, హరిత నవీకరణ కేంద్రాల (జి ఇ ఎస్) ఏర్పాటు, వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్ పి ఓ) ఏర్పాటు, శుద్ధ జల కేంద్రాల నిర్వహణ, నీటి నాణ్యత పరిశీలన, మాతాశిశువులు, కౌమార బాలికల ఆరోగ్య సంరక్షణ చర్యలు, ఆదర్శ గ్రామాల నిర్మాణం, ప్రకృతి

## నిర్వహించిన ప్రాజెక్టులు, కార్యక్రమాలు

ఏపిమాస్ తన ఈ 25 ఏళ్ళ సేవా ప్రస్థానంలో ఎన్నో ప్రాజెక్టులను అమలు చేసింది. మరెన్నో కార్యక్రమాలను నిర్వహించింది. వాటిలో కొన్ని స్వయంగా మరికొన్ని భాగస్వామ్యంలో నిర్వహించినవి. సాంకేతిక సహకారానికి, మార్గదర్శనానికే పరిమితమైనవి కాగా, మరికొన్ని క్షేత్రస్థాయిలో ఆచరణాత్మకంగా సాగినవి. అవేమిటో ఈ జాబితా తెలుపుతుంది. వీటిలో ముఖ్యమైన కొన్నిటి గురించి క్లుప్తంగా యిదే సంచికలో 'ఏపిమాస్ కార్యాచరణ పథం' శీర్షికన మరికొంత వివరంగా తెలుసుకోవచ్చు. అవేమిటో చ

- స్వయంసహాయ సంఘాల,సమాఖ్యల బలోపేతం
- స్వయం నియంత్రణ ఉద్యమం
- ఆదర్శ స్వయంసహాయ సమాఖ్యల నిర్మాణం
- నీరు, పారిశుధ్యం, ఆరోగ్యం (వాష్ ప్రాజెక్ట్)
- పట్టణ పోషకాహారం, లైంగిక సమానత్వం
- రాయలసీమ జలజీవని పథకం
- ఆజీవ
- వాతావరణ హిత గ్రామాలు
- రైతు సేవా కేంద్రాలు
- హెచ్ హెచ్ ఏ ఐ
- ఉద్యాన వనాల ప్రాజెక్టు
- పాడిపంటలు
- ఎఫ్ పి ఓలు
- గ్రామీణ వ్యాపారాల ప్రోత్సాహక పథకం
- సి బి బి ఓ ప్రాజెక్టులు
- ఆదర్శ గ్రామాల నిర్మాణం
- వాటర్‌షెడ్ల అభివృద్ధి
- గో గ్రీన్ గ్రో గ్రీన్ (జి4) ప్రాజెక్ట్
- జీవనోపాధుల పెంపుదల
- నైపుణ్యాభివృద్ధి కేంద్రాల నిర్వహణ
- బంగారు కుటుంబాల'కు చేయూత (పి4 ప్రాజెక్ట్)
- విద్యా సంస్థలలో మౌలిక వసతుల కల్పన

వ్యవసాయానికి ప్రోత్సాహం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ-ప్రైవేటు-ప్రజా ఉమ్మడి భాగస్వామ్య కార్యక్రమంలో 'బంగారు కుటుంబాల' ఉజ్వల భవిష్యత్తుకు మార్గదర్శనం ...ఇలా వివిధ సంబంధిత రంగాలకు విస్తరించి, యిప్పటికే 4.7 లక్షల కుటుంబాలకు తోడ్పాటు అందిస్తూ, మరెందరికో చేయూతనిచ్చే స్థాయికి ఎదిగింది. అంటే సంస్థల మెరుగుదలతో ప్రారంభమైన ఏపిమాస్ ప్రస్థానం మొత్తం సామాజిక వ్యవస్థ అభ్యున్నతిలో కీలక భాగస్వామిగా సమగ్రతను సంతరించుకున్నది.

చేపట్టిన ఏ కార్యక్రమాన్నయినా పూర్తిగా దృష్టి కేంద్రీకరించి (ఫోకస్), సమర్థంగా నాణ్యంగా, లబ్ధిదారులకు దీర్ఘకాలిక ప్రయోజన దాయకంగా నిర్వహించాలన్నదే ఏపిమాస్ ఆకాంక్ష. అందుకు అనుగుణంగా ఎప్పటికప్పుడు అవసరాలను, అవకాశాలను, తన శక్తిసామర్థ్యాలను, అనుభవాలను అంచనా వేసుకుంటూ ముందుకు సాగుతుంటుంది. ఆ ప్రాతిపదికగా ఇప్పుడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్ రాష్ట్రాలలో ఏపిమాస్ వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నది.

జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్ రాష్ట్ర ప్రభుత్వాలు, నాబార్డ్, అరబిందో ఫార్మా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మరికొన్ని సంస్థ లు ; అంతర్జాతీయ స్థాయిలో జర్మనీకి చెందిన జి ఐ జడ్, డి జి ఆర్ వి, బ్రెడ్ ఫర్ ది వరల్డ్, అమెరికాకు చెందిన బి ఎం జి ఎఫ్, కెనడాకు చెందిన కోడి ఇంటర్నేషనల్, లక్సెంబర్గ్ కు చెందిన ఏ ఇ ఐ ఎన్ ఇ తదితర సంస్థలు ఏపిమాస్‌కు సహకారం అందిస్తున్నాయి.

ఫలప్రదమైన సేవలతో రజతోత్సవాన్ని పూర్తిచేసుకుని, స్వర్ణోత్సవం దిశగా తన సేవా ప్రస్థానాన్ని ద్విగుణీకృతోత్సాహంతో, చెదరని అంకితభావంతో కొనసాగించడానికి పునరంకితమవుతున్న ఏపిమాస్ మరిన్ని ఘన విజయాలు సాధిస్తూ, మరెందరి అభ్యున్నతికో ఆధారంగా, బాసటగా, చోదక శక్తిగా నిలవగలదని ఆశించవచ్చు. ■

## ఏపిమాస్ భాగస్వామ్య, దాతృత్వ సంస్థలు

1. **జాతీయ , గ్రామీణాభివృద్ధి భాగస్వాములు**
   ➢ నాబార్డ్ , ఎన్ఆర్ఎల్ఎం , ఎస్ఆర్ఎల్ఎంలు
2. **ప్రారంభ దశలో సంస్థాగత , దాతృత్వ మద్దతుదారులు**
   ➢ ఫోర్డ్ ఫౌండేషన్ , డీఎఫ్ఐడీ - యునైటెడ్ కింగ్‌డమ్ , కేర్ ఇండియా
3. **అంతర్జాతీయ భాగస్వామ్యాలు , సాంకేతిక సహకార సంస్థలు**
   ➢ డీజీఆర్‌వీ - జర్మనీ , జీఐజెడ్ - జర్మనీ , ఆగా ఖాన్ ఫౌండేషన్ , యూరోపియన్ యూనియన్ , కోడి ఇంటర్నేషనల్ - కెనడా , ప్రపంచ బ్యాంకు
4. **జాతీయ స్థాయి నెట్‌వర్క్‌లు , సమాఖ్యలు**
   ➢ ఎనేబుల్ నెట్‌వర్క్ , నాఫ్ పో, బఫా , ఎస్ఎఫ్ఏసీ ఎన్‌సీడీసీ , ప్రియా ... వాణి
5. **కార్పొరేట్ సామాజిక బాధ్యత దాతృత్వ సంస్థలు**
   ➢ ఎస్‌బీఐ ఫౌండేషన్ , అరవిందో ఫార్మా ఫౌండేషన్, అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ , ఇ వై ఫౌండేషన్, విప్రో కేర్స్ , మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ లిమిటెడ్
6. **రాష్ట్ర స్థాయి సాంకేతిక ఆధార సంస్థలు**
   ➢ స్త్రీ నిధి ,ఇక్రిసాట్,ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాష్ట్ర వ్యవసాయ శాఖలు హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు , మేనేజ్ , ఎన్ఐఆర్‌డీపీఆర్

ఇంకా ... వాటర్ అర్గ్, ఏ ఇ ఐ ఎన్ - లక్సెంబర్గ్, సమున్నతి, మెట్రో, జీవిక, ఆజీవిక, ఇర్మా, ఇ ఫ్రెష్, మేనేజ్, ఎకాలజీ సెంటర్, బిగ్ బాస్కెట్, మై గ్రోమోర్, మోర్ మెగాస్టోర్, సి ఎస్ ఏ), ది టింబక్టు కలెక్టివ్, వాసన్ ఇండియా, జన జాగృతి, రెడ్స్, రిడ్స్, ఫౌండేషన్ ఫర్ ఎకాలజికల్ సెక్యూరిటీ (ఎఫ్ ఇ ఎస్) వంటివి వున్నాయి. ■

సమస్యే ఒక పరిష్కారం, పరిష్కారమే ఒక సమస్య. పొయ్యిలో వున్న నిప్పు పరిష్కారం, ఇల్లంటుకుంటే అదే సమస్య

# పి 4 ఫలాలు అందుకుంటున్న 'బంగారు కుటుంబాలు'

**ఆం**ధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని 2029 నాటికి పేదరికరహిత రాష్ట్రంగా (సున్నా పేదరికం) తీర్చిదిద్దే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన పి4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్, పార్టనర్‌షిప్) కార్యక్రమం వేగం పుంజుకుంటోంది. ఇది 'స్వర్ణాంధ్ర 2047' విజన్‌కు అనుగుణంగా ఉంది. ఈ చొరవ ప్రభుత్వం, ప్రైవేట్ రంగం,సమాజం భాగస్వామ్యాన్ని ఒకే వేదిక మీదకు తెస్తుంది. 2029 సెప్టెంబర్ నాటికి జీవనోపాధి పెంపుదల,

**ఏపిమాస్ కార్యాచరణ పథం**



నైపుణ్యాభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా బంగారు కుటుం బాల సగటు ఆదాయాన్ని 20% వరకు పెంచడం, వారికి గౌరవప్రదమైన జీవనశైలి కల్పించడం పి4 ప్రాజెక్టు లక్ష్యం.

**యం ఇ ఐ ఎల్– ఏపిమాస్ భాగస్వామ్యం**

మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (యం ఇ ఐ ఎల్) మార్గదర్శిగా ఈ ప్రాజెక్ట్ కింద కృష్ణాజిల్లా లోని గుడ్లవల్లేరు, చిత్తూరు జిల్లాలోని రామకుప్పం మండలాలను దత్తత తీసుకుంది. ఈ రెండు మండలాల్లో అమలు బాధ్యతలను ఏపిమాస్ నిర్వహిస్తున్నది.

**నాలుగు రంగాలపై దృష్టి**

- జీవనోపాధి: ఆర్థికాభివృద్ధి చెందాలన్న ఆకాంక్షలను పెంపొందించడం, జీవనోపాధి ప్రణాళికలు రూపొందించడం, వ్యాపార నైపుణ్యాలను, ఆర్థిక అక్షరాస్యత కల్పించడం.
- **సంక్షేమ హక్కులు:** ప్రభుత్వ పథకాలు, అవసరమైన మౌలిక పత్రాల (డాక్యుమెంట్స్) లభ్యతను సులభతరం చేయడం.
- **ఆరోగ్యం , విద్య:** ఆరోగ్య శిబిరాల నిర్వహణ, మందుల పంపిణీ , ఉన్నత విద్య కోసం విద్యార్థులకు స్కాలర్‌షిప్
- **గ్రామ మౌలిక సదుపాయాలు:** అంగన్‌వాడీ కేంద్రాల, పాఠశాలల పునరుద్ధరణ, వీధిదీపాలు, తాగునీరు డ్రైనేజీ వ్యవస్థల మెరుగుదల.

**బంగారు కుటుంబాలను గుర్తించడానికి ప్రాతిపదికలు**

- నెలకు రూ. 10,000 కంటే తక్కువ ఆదాయం ఉండటం.
- సొంతంగా భూమి, పశువులు లేదా ఉత్పాదక ఆస్తులు లేకపోవడం.
- కుటుంబంలో వ్యాధులు లేదా దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడే సభ్యులు ఉండటం.
- మహిళలు, వృద్ధులు లేదా అనాథల కుటుంబాలు.
- ఎస్.సి, ఎస్.టి, మైనారిటీ , దివ్యాంగుల కుటుంబాలు.

**బంగారు మిత్రలు: పేదరికంపై పోరాడే సైనికులు**

ఈ ప్రాజెక్టులో అత్యంత కీలకమైన పాత్ర 'బంగారు మిత్ర'(కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్)లది. ఏపిమాస్ నిర్వహణ లోని గుడ్లవల్లేరు, రామకుప్పం మండలాలలో మొత్తం 32 మంది బంగారు మిత్రలు ప్రాజెక్టులో చేరారు. వారికి శిక్షణ ఇవ్వబడింది. గుడ్లవల్లేరు మండలంలో 17 మంది బంగారు మిత్రలు 1,560 'బంగారు కుటుంబాల' అభివృద్ధికి బాధ్యత వహిస్తున్నారు.

- కుటుంబ అభివృద్ధి ప్రణాళిక (ఎఫ్ డి పి): 'కోబో టూల్‌బాక్స్' యాప్ ద్వారా ఇప్పటివరకు 1218 కుటుంబ అభివృద్ధి ప్రణాళికలు సిద్ధమైనాయి. ■

# పారిశుధ్యం, పరిశుభ్రతను పెంచే 'వాష్' ప్రాజెక్ట్

ఏపిమాస్ వాటర్.ఆర్గ్ సంస్థ భాగస్వామ్యంతో 2020 జూన్ నుండి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 'వాష్' (నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత) ప్రాజెక్టును అమలు చేస్తోంది. ఈ కార్యక్రమం ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, కర్నూలు, చిత్తూరు జిల్లాలు ; తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, యాదాద్రి భువనగిరి, కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో కొనసాగుతోంది.

**ఏపిమాస్ కార్యాచరణ పథం**

"ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల సమాఖ్యలను బలోపేతం చేసి, సురక్షితమైన నీరు, పారిశుధ్య సదుపాయాల కోసం ఆర్థిక సేవలను అందుబాటులోకి తీసుకురావడం" అనే పేరుతో ఈ ప్రాజెక్టు అమలవుతోంది.

స్వయం సహాయ సమాఖ్యల వేదికలను వినియోగిస్తూ, వాటర్ క్రెడిట్విధానంలో సూక్ష్మ రుణాలను అందించడం ద్వారా సురక్షితమైన నీరు, పారిశుధ్యం, పరిశుభ్రతకు సంబంధించిన అవసరాలను తీర్చేందుకు కృషి చేస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా 20,000 సులువైన, సూక్ష్మ 'వాష్' రుణాలనుఅందించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది.




ఈ రుణాలను స్వయం సహాయ సంఘాలు, సమాఖ్యల ద్వారా అందజేస్తారు. మంచినీటి పైపు ఏర్పాటు కోసం, మరుగుదొడ్ల నిర్మాణం కోసం, సెప్టిక్ టాంకులు, మరుగు గుంతల తవ్వకం కోసం, ఇంటి పైకప్పుమీద వర్షపు నీటి నిల్వ ఏర్పాటు కోసం, నీటిశుద్ధి పరికరాల కోసం, చేతిపంపు కలిగిన బోరుబావి ఏర్పాటు కోసం, ప్రత్యేక అవసరాలు కావలసిన వ్యక్తులకోసం ఈ రుణాలను పొందవచ్చు.

**ప్రపంచ చేతుల పరిశుభ్రత, మరుగుదొడ్ల దినోత్సవాలు**

ప్రపంచ 'చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా, ప్రాజెక్టు బృందం పని చేస్తున్న ప్రాంతాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది. పరిశుభ్రమైన చేతులు ఆరోగ్య రక్షణలో ఎంత ముఖ్యమైనవో ప్రజలకు తెలియజేసింది.

అలాగే, ప్రతి సంవత్సరంనవంబర్ 19న నిర్వహించే ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా, స్వయం సహాయ సంఘాల సభ్యుల సహకారంతో గ్రామీణ, పట్టణ సమాజ స్థాయిలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను చేపట్టింది. సురక్షిత పారిశుధ్యం ప్రాముఖ్యత, మార్పును వేగవంతం చేయాల్సిన అవసరం, అలాగే చిన్న చిన్న ప్రయత్నాలు కూడా పెద్ద మార్పుకు దోహదపడతాయనే సందేశాలను ప్రజల్లో విస్తృతంగా చాటిచెప్పింది.

ఈ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్న సభ్యులు ర్యాలీలు, సమావేశాలు, చర్చా వేదికల్లో చురుకుగా పాల్గొని, సురక్షితమైన నీటి వినియోగం, పారిశుధ్యం , వ్యక్తిగత పరిశుభ్రతకు సంబంధించిన ముఖ్య సందేశాలను తమ సంఘ సభ్యులకు చేరవేయాలని సంకల్పించారు. తద్వారా సమాజంలో సానుకూల ప్రవర్తనా మార్పులను తీసుకురావడానికి వారు కట్టుబడి ఉన్నారు. ■

**కిటికీలు మూసి చీకటికి స్వాగతం పలుకుతావో, కిటికీలు తెరిచి వెలుగుకు ఆహ్వానం అందిస్తావో తేల్చుకో**

# మాతాశిశు ఆరోగ్యం, పోషకాహారం ప్రాజెక్టు

'విప్రో కేర్స్'ఆర్థిక సహకారంతో, ఏపిమాస్ అమలు చేసిన పోషకాహారం,ఆరోగ్యం ప్రాజెక్టు, తెలంగాణ రాష్ట్రంలోని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జి హెచ్ ఎం సి) పరిధిలోని పట్టణ మురికివాడల్లో నివసించే గర్భిణులు, పాలిచ్చే తల్లుల్లో ఆరోగ్య పరిరక్షణను, పోషకాహార వినియోగాన్ని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకుంది. స్వయం సహాయ సంఘాల (ఎస్ హెచ్ జి ) వేదికలను వినియోగిస్తూ, లైంగిక అసమానతలకు సంబంధించిన అవరోధాలను అధిగమించి, మహిళలలో, కౌమార బాలికలలో, కుటుంబాల్లో సానుకూల ప్రవర్తనా మార్పులను తీసుకురావడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశ్యం.




### ఏపిమాస్ కార్యాచరణ పథం

**అమలు ప్రాంతం**

జి హెచ్ ఎం సిపరిధిలోని 10 మురికివాడలలో ఉన్న 14 అంగన్‌వాడీ కేంద్రాలలోఈ ప్రాజెక్టునుఅమలు చేశారు. (మెహదీపట్నం సర్కిల్‌లో – 7 అంగన్‌వాడీ కేంద్రాలు, కార్వాన్ సర్కిల్‌లో – 7 అంగన్‌వాడీ కేంద్రాలు).

**లబ్ధిదారులు**

- వివిధ సామాజిక వర్గాలకు చెందిన సుమారు 26,000 మంది ప్రత్యక్ష లబ్ధిదారులు
- అవగాహన, సామాజిక చైతన్య కార్యక్రమాల ద్వారా మరో 40,000 మంది పరోక్ష లబ్ధిదారులు

**ప్రాజెక్టు లక్ష్యాలు**

- మురికివాడల్లో నివసించే గర్భిణులు, పాలిచ్చే తల్లులు, రెండేళ్లలోపు పిల్లలు, కౌమార బాలికలకు ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహనను పెంపొందించడానికి స్వయం సహాయ సంఘాల సంస్థాగత సామర్థ్యాన్ని, సామాజిక వనరులను బలోపేతం చేయడం.
- గర్భిణులు, పాలిచ్చే తల్లులు కనీసం ఐదు రకాల ఆహార సమూహాలను తమ ఆహారంలో చేర్చుకోవడంతో పాటు, సమగ్ర శిశు అభివృద్ధి సేవలు, ఆరోగ్య శాఖ అందించే అనుబంధ పోషకాహార, ఆరోగ్య సేవలను వినియోగించుకునేలా చూడడం
- శిశు పోషణకు సంబంధించిన ఉత్తమ పద్ధతులను ప్రోత్సహిస్తూ, 70 శాతం తల్లులు ప్రసవం జరిగిన గంటలోపే తల్లిపాలను ప్రారంభించేలా, 90 శాతం తల్లులు శిశువుకు మొదటి ఆరు నెలల పాటు పూర్తిగా తల్లిపాలను మాత్రమే అందించేలా చేయడం.
- 80 శాతం కౌమార బాలికలు రుతుక్రమ సమయంలో పరిశుభ్రమైన పద్ధతులను పాటించడంతో పాటు, వారి భద్రత, రక్షణకు సంబంధించిన అవగాహనను పెంపొందించడం.
- గర్భిణిగా వున్న సమయంలో, పాలిచ్చే కాలంలో వారిలో పోషకాహారానికి సంబంధించిన అపోహలను, మూఢనమ్మకాలను తొలగించడం. లైంగిక వివక్షకు ఆస్కారం లేకుండా చూడడం.

- ప్రాజెక్టు పరిధిలోని 100 శాతం గర్భిణులకు, పాలిచ్చే తల్లులకు, రెండేళ్లలోపు పిల్లల కుటుంబాలకు, కౌమార బాలికలకు అవగాహన కల్పించి, వారిలో సుస్థిరమైన ప్రవర్తనా మార్పును తీసుకురావడం.

**ముఖ్య వ్యూహాలు**

ఈ ప్రాజెక్టు సామాజిక మరియు ప్రవర్తనా మార్పు సమాచార ప్రసార (ఎస్ బి సి సి) విధానాన్ని అనుసరిస్తూ క్రింది వ్యూహాలను అమలు చేసింది:

- స్వయం సహాయక సంఘాల వేదికలను విస్తృతంగా వినియోగించి సమాజాన్ని చైతన్యపరచడం.
- గృహ సందర్శనలకు ప్రాధాన్యత ఇవ్వడం.
- సంబంధిత ప్రభుత్వ శాఖలతో సమన్వయాన్ని బలోపేతం చేయడం.
- లైంగిక వివక్ష కారణంగా అవరోధాలు, అడ్డంకులు ఎదురు కాకుండా చూడడంపై ప్రత్యేక శ్రద్ధ వహించడం
- గర్భిణులు, పాలిచ్చే తల్లులు, అత్తలు, పురుషులతో ప్రత్యేక ప్రవర్తనా మార్పు సమావేశాలను నిర్వహించడం.
- ఆరోగ్యం, పోషకాహారంపై అంశాల వారీ ప్రచార కార్యక్రమాలను చేపట్టడం.
- ఆహార వైవిధ్యాన్ని ప్రోత్సహించేందుకు ఆహార ప్రదర్శనలను నిర్వహించడం.
- ఆరోగ్యం , పోషకాహారానికి సంబంధించిన జాతీయ దినోత్సవాలను నిర్వహించడం.
- మురికివాడ స్థాయి సమాఖ్యల (ఎస్ ఎల్ ఎఫ్ ఎస్) ప్రత్యేక సమావేశాలను సులభతరం చేయడం.
- సమాజ ప్రతినిధులతో కలిసి త్రైమాసిక స్థాయి సమన్వయ సమావేశాలను నిర్వహించడం.
- సీమంతం వంటి సమాజ ఆధారిత కార్యక్రమాలను నిర్వహించడం.
- కౌమార బాలికలలో పోషకాహారం , రుతుక్రమ పరిశు భ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం.
- సమాచార సాంకేతికత ఆధారిత తక్షణ పర్యవేక్షణ వ్యవస్థలను వినియోగించడం.

**భాగస్వామ్య సంస్థలు**

ఈ ప్రాజెక్టు క్రింది సంస్థల సహకారంతో అమలు చేయబడింది:

- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
- మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మున్సిపల్ ఏరియాస్ (మెప్మా)
- గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) పట్టణ సామాజికాభివృద్ధి విభాగం
- మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ
- ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ
- పాఠశాల విద్యాశాఖ (ఎగువ ప్రాథమిక స్థాయి)
- హోం సైన్స్ కళాశాల
- ఇతర స్వచ్ఛంద సంస్థలు మరియు అభివృద్ధి భాగస్వామ్య సంస్థలు

**సమాచార సామగ్రి**

పోషకాహార లోపం, ఆహార వైవిధ్యం ప్రాముఖ్యత, రుతుక్రమ పరిశుభ్రత, కుటుంబ ఆరోగ్యంలో పురుషుల పాత్ర , ఇతర భాగస్వాముల బాధ్యతలపై అవగాహన కల్పించేందుకు ఏపిమాస్విన్యూత్నమైనసామాజిక ప్రవర్తనా మార్పు సమాచార ప్రసార (ఎస్ బి సి సి) సామగ్రిని రూపొందించింది.

ఈ సమాచార సామగ్రిని శిక్షణా కార్యక్రమాలు, స్వయం సహాయక సంఘాల సమావేశాలు, మురికివాడ స్థాయి సమాఖ్యల సమావేశాలలో విస్తృతంగా వినియోగించారు. అలాగే ప్రభుత్వ శాఖలు, ఇతర సంస్థలు రూపొందించిన సమాచార సామగ్రిని కూడా అవసరానుసారం ఉపయోగించారు.

**ఈ సమాచార సాధనాలలో:**

- విద్యాపరమైన ఆటలు, పోస్టర్లు, ఫ్లిప్ చార్టులు, వీడియో క్లిప్పులు , శిక్షణా మాడ్యూల్లు , పరస్పర చర్యలకు అనుకూలమైన అభ్యాస సామగ్రి వంటివి వుంటాయి. ■

నీవు వెలుగులో వుంటే, వెలిగిపోతుంటే అందరూ, అన్నీ నీ వెంటే నీవు చీకట్లో వుంటే ఆఖరుకు నీ నీడ కూడా నీవెంటరాదు

# సమాఖ్యల సుస్థిరాభివృద్ధికి స్వయం నియంత్రణ ఉద్యమం!

**భా**రతదేశంలోని స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్ జి) ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడానికి ఏపిమాస్2008 సంవత్సరం నుంచి 'స్వయం నియంత్రణ' (సెక్టర్ ఓన్ కంట్రోల్ – ఎస్ఓ సి) ఉద్యమాన్ని చేపట్టింది. జర్మనీకి చెందిన డి జి ఆర్ వి సంస్థ తోడ్పాటుతో ఈ కార్యక్రమం అమలు జరుగుతున్నది. 'గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ' (సెర్ప్) సహకారంతో తెలంగాణ రాష్ట్రంలోని (అప్పటి నిజామాబాద్, ప్రస్తుతపు కామారెడ్డి జిల్లా) 'కామారెడ్డి క్లస్టర్'లో ప్రయోగాత్మకంగా చేపట్టి, అనంతరం స్థిరీకరించి, విస్తరించి, విజయవంతంగా అమలు చేస్తున్నారు.

*ఏపిమాస్ కార్యాచరణ పథం*

ఈ కార్యక్రమంలో ఐదు మండల స్థాయి సమాఖ్యలు, 193 గ్రామ సంఘాలు, 5,000 స్వయం సహాయక సంఘాలు పాల్గొని, స్వయం నియంత్రణ (ఎస్ఓ సి)నమూనాను విజయవంతంగా అభివృద్ధి చేసి, అమలు చేశాయి. ఈ అనుభవాల స్ఫూర్తితో, దేశంలోని పది రాష్ట్రాలలో పని చేస్తున్న 17 స్వయం సహాయక సంఘాల ప్రోత్సాహక సంస్థలు (ఎస్ హెచ్ పి ఐ లు), స్వచ్ఛంద సంస్థలు, గ్రామీణ, పట్టణ జీవనోపాధి మిషన్లు, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సి ఎస్ ఆర్) సంస్థలుఈ నమూనాను పూర్తిగా లేదా పాక్షికంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో అమలు చేస్తున్నాయి.

> స్వయం సహాయ సంఘాలు, వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్ పి ఓలు), సహకార సంస్థల వంటి సభ్యత్వ ఆధారిత సంస్థలకు 'స్వయం నియంత్రణ' విధానం అత్యంత అనుకూలమైనది.

**ఎస్ఓ సిప్రభావాలు**

ఎస్ ఓ సి ప్రాజెక్టు ప్రభావ మూల్యాంకనం ద్వారా, సభ్యులలో తమ సమాఖ్యల పట్ల యాజమాన్య భావన గణనీయంగా పెరిగినట్లు వెల్లడైంది. సమాఖ్యలు తమ స్వంత సంస్థలేననే భావనతో సభ్యులు వాటి పాలన, నిర్వహణ బాధ్యతలను స్వయంగా చేపట్టడం ప్రారంభించారు. దీనివల్ల జవాబుదారీతనం పెరిగి, ఎస్ హెచ్ జి లు, గ్రామ సంఘాలు, క్లస్టర్ సమాఖ్యలు తమ సంస్థలలో నాయకత్వ, పర్యవేక్షణ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తున్నాయి.

సభ్యుల భాగస్వామ్యం పెరగడం వల్ల నిధుల లభ్యత, ఆస్తులు, లాభాలు, అప్పులు వంటి అంశాలలో పారదర్శకత మెరుగుపడింది. సమావేశాల నిర్వహణలో సిబ్బంది సమయం తక్కువగా వినియోగించాల్సి రావడంతో, వారు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను సభ్యులకు చేరవేయడం, జీవనోపాధి అభివృద్ధికి మార్గదర్శకత్వం, అనుసంధానాలను కల్పించడం వంటి అంశాలపై ఎక్కువ దృష్టి సారించగలుగుతున్నారు.

మహిళా నాయకుల ఆత్మవిశ్వాసం గణనీయంగా పెరిగింది. నాయకత్వ మార్పిడి విధానం ద్వారా సభ్యులందరికీ నాయకత్వ అవకాశాలు లభిస్తున్నాయి. దీని వలన సంస్థల పనితీరుపై విశ్వాసం పెరగడమే కాకుండా, సామాజిక మూలధనంగా బలమైన నాయకత్వ వనరులు అభివృద్ధి చెందాయి. ఎస్హెచ్జి సమాఖ్యలకు సమాజంలోనూ, బయటి ప్రపంచంలోనూ సానుకూల ప్రతిష్ఠను తీసుకొస్తున్నారు. కామారెడ్డి క్లస్టర్లో ముఖ్యమైన వ్యవస్థగా, సభ్యుల ఆధారిత పర్యవేక్షణతో "కామారెడ్డి క్లస్టర్ పర్యవేక్షణ సమాఖ్య" ఏర్పాటు చేయబడింది.

**మూడు రాష్ట్రాలలో ఫలితాలు**

కామారెడ్డి క్లస్టర్లో చేపట్టి, ఏపిమాస్ నిర్వహణలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్ రాష్ట్రాలకు 'స్వయం నియంత్రణ' ఉద్యమ విస్తరణ ద్వారా లభించిన ఫలితాలు,ఎస్ హెచ్ జి ఉద్యమం మరింత బలపడుతూ, దీర్ఘకాలిక స్థిరత్వాన్ని సాధించే దిశగా ముందుకు సాగుతోంది. ■

**వివేకమంటే అన్నీ తెలిసివుండడం కాదు. తెలిసిన దాని లోతుపాతులు తెలుసుకోగలగడం**

# వ్యవసాయం , ఉద్యాన రంగాలపై ప్రత్యేక దృష్టి

ఏపిమాస్ కార్యాచరణ పథం

**మ**హిళల ఆధ్వర్యంలోని రైతు ఉత్పత్తిదారుల సంస్థల ఏర్పాటు , బలోపేతానికి ప్రాధాన్యత ఇవ్వడం.

- **విలువ గొలుసు జోక్యాలు**

ఉత్పత్తి నుండి మార్కెటింగ్ వరకు విలువను పెంచే చర్యలపై దృష్టి పెట్టడం.

- **సమగ్ర మద్దతు**

మౌలిక సదుపాయాలు, మార్కెట్ అనుసంధానం ఆర్థిక వనరుల పరంగా సమగ్ర సహాయాన్ని అందించడం.

- **యువత , మహిళల భాగస్వామ్యం**

వ్యవసాయ వ్యాపారాలలో యువత , మహిళల చురుకైన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం.

**ఆశించిన ఫలితాలు**

- రైతుల ఉత్పత్తి వ్యయం తగ్గుతుంది.
- రైతులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు లభిస్తాయి.
- సమిష్టి కొనుగోళ్లు , విక్రయాల ద్వారా అధిక లాభాలు పొందే అవకాశం ఏర్పడుతుంది.
- మహిళలు , యువత వ్యవసాయ వ్యాపారాల్లో నాయకత్వ పాత్ర పోషిస్తారు.
- వ్యవసాయ రంగం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మరింతగా దోహదపడుతుంది. ■

# రైతులకు అనేక సేవలను అందిస్తున్న పీలేరు ఎఫ్ ఎస్ సి

**ఏ**పిమాస్ నిర్వహణలో, అరబిందో ఫార్మా ఆర్థిక సహాయంతో పీలేరులో ఏర్పాటు చేయబడిన రైతు సేవా కేంద్రం (ఎఫ్ ఎస్ సి) స్థానిక రైతులకు వ్యవసాయం, పశు సంవర్థక, వ్యాపార అభివృద్ధికి సంబంధించిన సమగ్ర సేవలను అందిస్తోంది. పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏ పి ఎమ్ సి) యార్డులో ఉన్న ఈ కేంద్రం పంటల ఉత్పాదకతను పెంచడంలో, ఆధునిక వ్యవసాయ యంత్రాలను సరసమైన ధరలకు అందుబాటులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తోంది.

**1. కస్టమ్ హైరింగ్ సెంటర్ (CHC)**

రైతులకు ట్రాక్టర్లు, నాగళ్లు, రోటావేటర్లు వంటి వ్యవసాయ యంత్రాలను సబ్సిడీ ధరలకు అద్దెకు అందజేస్తుంది. దీని ద్వారా సాగు వ్యయాలు తగ్గి, యాంత్రీకరణకు ప్రోత్సాహం లభిస్తుంది.

**2. ఉత్పాదకత పెంపు కార్యక్రమాలు**

టమాటా వంటి స్థానిక పంటల ఉత్పాదకతను మెరుగుపరచడానికి రైతులకు శిక్షణలు, క్షేత్రస్థాయి సాంకేతిక

**3. పశుసంవర్థక , పశు ఆరోగ్య సేవలు**

పశుసంవర్థక రంగంలో పరిశోధనలు, పశువైద్య సహాయం, పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం ద్వారా రైతుల జీవనోపాధిని బలోపేతం చేస్తోంది.

**4. విజ్ఞాన , మార్కెట్ అనుసంధాన సేవలు**

వాతావరణ, మార్పుల సమాచారాన్ని అందించడం, ఎఫ్ పి ఓ లను స్థిరమైన వ్యవసాయ ఆధారిత వ్యాపార సంస్థలుగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన శిక్షణలను, మార్గదర్శకత్వాన్ని అందిస్తోంది.

**సమగ్రంగా**

మొత్తం మీద పీలేరు రైతు సేవా కేంద్రం స్థానిక రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ, పంటల ఉత్పాదకత, పశు సంవర్థకం, అభివృద్ధి , మార్కెట్ అనుసంధాన సేవలను ఒకే వేదికపై అందిస్తూ, రైతుల ఆదాయాన్ని, జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి కృషిచేస్తున్న సేవా కేంద్రంగా నిలుస్తోంది. ■

అవకాశం అందినట్టే అంది చేజారిపోతుంటుంది. దాన్ని ఒడిసి పట్టుకోవాలి, పట్టువీడకుండా ముందుకు నడిపించాలి

# రజతోత్సవ శుభాకాంక్షల సుమగంధం!

ఏపిమాస్ రజతోత్సవం సందర్భంగా పలువురు ప్రముఖులు అందజేసిన అభినందన సందేశాలను క్రిందటి సంచికలో ప్రచురించాము. తాజాగా అందిన మరికొన్ని శుభాకాంక్షల సందేశాలను ఈ సంచికలో ప్రచురిస్తున్నాము.

**మీ కృషివల్లే ఈ స్థాయి గౌరవం: జయేష్ రంజన్**

మీరు చేసిన అద్భుతమైన పని, మీ కృషి, కఠోర శ్రమ, అంకితభావం వల్లే మనకు ఈ స్థాయి గౌరవం, ఖ్యాతి లభించింది. మీ అందరికీ అభినందనలు.



ఈ ఉత్సాహాన్ని, ఈ వేగాన్ని మీరు ఇదే విధంగా కొనసాగిస్తూ, మీకు, మీ కుటుంబ సభ్యులకు , ఏపిమాస్‌కు మరింత కీర్తి తీసుకు రావాలని మేము ఆశిస్తున్నాము.

తెలంగాణలో మేము “తెలంగాణ రైజింగ్” అనే పేరుతో విజన్–2047ను రూపొందించాము. ఆ విజన్ పత్రంలో ముఖ్యంగా రైతులు, మహిళల కోసం ఎంతో ప్రాధాన్యమైన నిర్ణయాలు, లక్ష్యాలు ప్రతిపాదించబడ్డాయి. అందువల్ల, తెలంగాణలో మేము చేయాలనుకుంటున్న కార్యక్రమాల గురించి మీరు పూర్తిగా అవగాహన పొందాలి. దీనిని ఏపిమాస్ ను తదుపరి స్థాయికి తీసుకెళ్లడానికి, అలాగే ఈ రంగంలో పనిచేస్తున్న ఇతర నిపుణులు , సంస్థలకు స్ఫూర్తినిచ్చే ఒక గొప్ప అవకాశంగా పరిగణించండి. అందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు.

**విశేషమైన సేవల ఏపిమాస్ : చింతల జి ఆర్**



స్వయం సహాయక సంఘాలు , రైతు ఉత్పత్తిదారుల సంస్థల కోసం సామర్థ్య నిర్మాణ సంస్థగా పనిచేస్తున్న ఏపీమాస్ తన ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తూ రజతోత్సవ వేడుకల దిశగా అడుగులు వేస్తుండటం ఎంతో ఆనందదాయకం.

ఏపీమాస్ చేపట్టిన రంగాలకు అది విశేషమైన సేవలను అందించిందని గర్వంగా చెప్పగలను. భారత ప్రభుత్వ ఎఫ్‌పీఓ కార్యక్రమానికి ఏపీమాస్ ఒక సీబీబీఓగా ఎంపికై, రైతు ఉత్పత్తిదారుల సంస్థల ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడంలోనే కాకుండా, స్వయం సహాయక సంఘాల ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడంలో కూడా విశేష కృషి చేస్తుండటం నాకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది.

ఏపీమాస్ తన భావి ప్రయాణంలో మరిన్ని విజయాలు సాధించాలని, మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

**భాగస్వామ్యాలు ప్రశంసనీయం:అనితా రామచంద్రన్**

రైతు ఉత్పత్తిదారుల సంస్థల విషయంలో ఏపిమాస్ చేసిన పని ఎంతో విశిష్టమైనది. నేను యాదాద్రి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో, ముఖ్యంగా కోవిడ్ కాలంలో, ఏపిమాస్ ఆధ్వర్యంలో పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఏర్పడిన ఎఫ్‌పీఓలే ప్రజలకు అండగా నిలిచాయి. ముఖ్యంగా మార్కెటింగ్ విషయంలో అవి ప్రజలకు ఎంతో తోడ్పాటును అందించాయి. మహిళల ఎఫ్‌పీఓలు అద్భుతమైన సేవలను అందించాయి.

అలాగే వివిధ సంస్థలతో, ఇతర స్వచ్ఛంద సంస్థలతో, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో, ముఖ్యంగా జర్మనీతో పాటు ఇతర దేశాల సంస్థలతో మీరు ఏర్పరచుకున్న భాగస్వామ్యాలు కూడా ఎంతో ప్రశంసనీయం. ఇది నిజంగా అభినందనీయమైన విషయం. అదనంగా, మీరు నమూనా కాని గ్రామాల్లో కూడా పనిచేశారని నాకు తెలుసు. నేను చాలా కాలం రాయలసీమ ప్రాంతంలో పనిచేసినందున, అక్కడ అమలవుతున్న రాయలసీమ వాటర్ కనెక్ట్ కార్యక్రమం గురించి నాకు అవగాహన ఉంది. అలాగే చిరుధాన్యాల వినియోగం ప్రోత్సాహానికి సంబంధించిన కార్యక్రమాలను కూడా మీరు చేపట్టారని తెలుసు.



మొత్తం మీద ఇది అద్భుతమైన ప్రయాణం. మరోసారి మీ అందరికీ నా హృదయపూర్వక అభినందనలు,శుభాకాంక్షలు. తెలియజేస్తున్నాను. రాబోయే మరో 25 సంవత్సరాలు మాత్రమే కాదు, అంతకంటే ఎక్కువ కాలం కూడా మీరు ఇదే ఉత్సాహంతో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నాను.

మన స్వయం సహాయక సంఘాల సమాఖ్యలు ఎంతో ఉన్నత స్థాయికి చేరుకున్నాయి. అయితే ఇప్పుడు మనం తదుపరి స్థాయికి ఎదగాల్సిన సమయం వచ్చింది. ఈ స్వయం సహాయక సంఘాలు , రైతు ఉత్పత్తిదారుల సంస్థల ఈ సుదీర్ఘ ప్రయాణంలో ప్రభుత్వానికి ఏపిమాస్ ఒక ప్రముఖ భాగస్వామిగా నిలుస్తుందని నాకు పూర్తి విశ్వాసం ఉంది.

**మెప్మాకు విశేష సహకారం: జనార్ధన రెడ్డి బి**

శ్రీ చంద్రశేఖర్ రెడ్డి గారికి, అందరికీ సుపరిచితమైన సి.ఎస్. రెడ్డి గారికి, అలాగే ఏపీమాస్ సంస్థకు హృదయపూర్వక అభినందనలు. సంస్థ తన సేవా ప్రయాణంలో రజతోత్సవాన్ని పూర్తిచేసుకుని, 26వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న ఈ సందర్భంగా వారికి నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.



శ్రీ సి.ఎస్. రెడ్డి గారు నాకు మూడు దశాబ్దాలకు పైగా తెలుసు. 2001లో ఏపీమాస్ స్థాపన జరిగినప్పటి నుంచి మేము సన్నిహితంగా అనుబంధంగా ఉన్నాము. నేను పట్టణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన కోసం పనిచేసే మిషన్ 'మెప్మా' సంస్థకు మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న సమయంలో, ఏపీమాస్‌తో మా సంస్థకు సన్నిహిత సహకారం కొనసాగింది.

ఆ సమయంలో శ్రీ సి.ఎస్. రెడ్డి గారు, వారి సహచరులు, మొత్తం ఏపిమాస్ బృందం మెప్మాతో కలిసి పనిచేసి విశేషమైన సేవలను అందించారు. ముఖ్యంగా పట్టణ పేదరికానికి సంబంధించిన లోటుపాట్లను గుర్తించడం, వాటి పరిష్కారానికి అనువైన విధానాలు , వ్యూహాలను రూపొందించడం, సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలను నిర్వహించడం వంటి అంశాలలో వారు ముఖ్యమైన పాత్ర పోషించారు.

అలాగే బ్యాంకులు, పురపాలక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు , ఇతర సంస్థల మధ్య సమన్వయాన్ని పెంపొందించి, పౌర సమాజ సంస్థల ఏర్పాటుకు , బలోపేతానికి కూడా వారు విశేషంగా తోడ్పడ్డారు.

**క్షేత్రస్థాయిలో గెలిచి నిలిచి: సుశీల చింతల**

ఏపీమాస్ 25 సంవత్సరాలు పూర్తిచేసుకున్న ఈ సందర్భంలో, ఏపీమాస్ సంస్థకు, దాని వ్యవస్థాపకులు సి.ఎస్. రెడ్డి గారికి , వారి మొత్తం బృందానికి నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను.

నిజంగా చెప్పాలంటే, ఏపీమాస్‌కు ఇది ఎంతో ఉత్సాహభరితమైన, సవాళ్లతో కూడిన, సార్థకమైన ప్రయాణం. మహిళల సాధికారత కోసం వారు చేసిన కృషి, స్వయం సహాయక సంఘాల వ్యవస్థలో వారు పోషించిన పాత్ర ఎంతో విశిష్టమైనది. సంఘాల ఏర్పాటు, శిక్షణ కార్యక్రమాలు, మార్కెట్లతో అనుసంధానం వంటి ప్రతి అంశంలోనూ వారు అందించిన సేవలు ఎంతో హృద్యమైనవి, ప్రేరణాత్మకమైనవి. ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సేవలందించిన రాష్ట్ర స్థాయి సంస్థగా ప్రారంభమైన ఏపీమాస్, తరువాత తెలంగాణ ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో తన సేవలను విస్తరించింది. నేడు దేశవ్యాప్తంగా చురుకైన పాత్ర పోషించడమే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో కూడా తన ముద్రను వేసింది.



క్షేత్రస్థాయిలో తమ ప్రత్యేకతను, తమ వినూత్న జోక్యాలను, ప్రభావవంతమైన కార్యక్రమాలను నిరూపించకపోతే ఇంతటి గుర్తింపు, గౌరవం, విస్తరణ సాధ్యమయ్యేది కాదు. ఈ విజయయాత్ర నిజంగా ప్రశంసనీయం.

**మహిళా సాధికారతకు విశేష కృషి:ఎన్.వి.రమణ**

గత 25 సంవత్సరాల్లో ఏపిమాస్ ఒక వినూత్న సంస్థగా ఎదిగింది. తన స్వంత అనుభవాల నుండి నేర్చుకుంటూ నిరంతరం అభివృద్ధి చెందింది. ముఖ్యంగా మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థలను ప్రోత్సహించడంలో, అలాగే ఇతర

అన్నీ సిద్ధమైతేనే అడుగు ముందుకు వేయాలనుకుంటే, ఆ రోజు ఏనాటికీ రాకనేపోవచ్చు

మహిళా సంఘాల సభ్యులు కూడా వివిధ ఎఫ్ పి ఓల బోర్డు సభ్యులుగా భాగస్వాములు కావడంలో ఒక సమర్థమైన విధానాన్ని ఏపిమాస్ అభివృద్ధి చేసింది. ఫలితంగా, పాలన, నిర్వహణ వ్యవస్థలు సమర్థవంతంగా అమలవుతూ, ఈ సంస్థలు విజయవంతమైన వ్యాపార కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి.

ఏపిమాస్ ఈ 25 సంవత్సరాల వేడుకలు విజయవంతం కావాలని నేను హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తున్నాను. గత 25 సంవత్సరాల్లో నేను చూసిన అభివృద్ధిని బట్టి, రాబోయే కాలంలో ఇది మరింత ఉన్నత స్థాయికి చేరుకుని మరింత ప్రభావాన్ని చూపుతుందని నాకు నమ్మకం ఉంది.



ఇది ఒక గొప్ప ప్రయాణంగా కొనసాగుతుందని నేను విశ్వసిస్తున్నాను. భారీ స్థాయిలో ప్రజలను చేరుకుంటూ, ఏపిమాస్ 25 సంవత్సరాల ప్రయాణాన్ని దాటి మరింత విలువైన , ప్రభావవంతమైన సంస్థగా ఎదుగుతుందని నాకు పూర్తి నమ్మకం ఉంది.

**ప్రజాదరణ పొందిన ప్రచురణలు:ఉదయ భాస్కర్**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ , బీహార్ రాష్ట్రాల్లో 81 రైతు ఉత్పత్తిదారుల సంస్థల ప్రోత్సాహానికి ఏపిమాస్ సీబీబీఓగా అమలు సంస్థగా కీలక పాత్ర పోషించింది. రైతు ఉత్పత్తిదారుల సంస్థల బలోపేతానికి సంస్థ అందించిన సేవలు విశేషమైనవి, దీర్ఘకాల ప్రభావాన్ని చూపినవి.

ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థల కోసం ప్రత్యేక విధానం లేకపోవడంతో, ఏపిమాస్ అందించిన సూచనలు , అనుభవాలను ఆధారంగా తీసుకుని ఒక ముసాయిదా ఎఫ్‌పీఓ విధానాన్ని సిద్ధంచేసి, తెలంగాణ ప్రభుత్వానికి సమర్పించాం. ఆ విధాన రూపకల్పనలో ఏపిమాస్ అందించిన విలువైన సూచనలు ఎంతో కీలకంగా నిలిచాయి. దీనివల్ల విధాన పరమైన వాదనలలో కూడా ఏపిమాస్ ఒక ముఖ్యమైన పాత్ర పోషించిందని చెప్పవచ్చు.

నాబార్డ్‌తో కలిసి ఏపిమాస్ చేసిన మరో ముఖ్యమైన కార్యక్రమం రైతు ఉత్పత్తిదారుల సంస్థల కోసం స్వయం అభ్యాస మాడ్యూళ్లు , పోస్టర్ల అభివృద్ధి. ఈ అధ్యయన సామగ్రి ఎంతో ప్రజాదరణ పొందింది. అనేక రాష్ట్రాల్లోని రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ఈ పాఠ్య సామగ్రిని ఉపయోగించుకొని తమ సంస్థలను మరింత బలోపేతం చేసుకున్నాయి. ఈ వనరులు ఎఫ్‌పీఓల సామర్థ్యాభివృద్ధికి, సంస్థాగత బలోపేతానికి ఎంతో దోహదపడ్డాయి.



ఏపిమాస్ రజతోత్సవ వేడుకల సందర్భంగా, నాబార్డ్ తరఫున ఏపిమాస్ యాజమాన్యం, సిబ్బంది, మొత్తం బృందానికి నా హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. రైతులు , రైతు ఉత్పత్తిదారుల సంస్థల సాధికారత కోసం ఏపిమాస్ భవిష్యత్తులో కూడా మరింత విజయవంతంగా తన సేవలను కొనసాగించాలని ఆకాంక్షిస్తున్నాను.

**సమాజానికి చేయూత : కళామణి**

**ఏ**పిమాస్ 25 సంవత్సరాల ప్రస్థానాన్ని జరుపుకోవడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. వ్యక్తిగతంగా కూడా, ఏపిమాస్‌లో గడిపిన గత 15 సంవత్సరాలు నాకు ఎంతో సంతృప్తినిచ్చాయి. ఎన్నో సవాళ్లు ఎదురైనప్పటికీ, నా పనిని నేను ఎంతో ఇష్టపడి, ఆనందంగా కొనసాగించాను. ఏపిమాస్ అభివృద్ధి భౌగోళికంగానూ, అంశాల పరంగానూ సహజసిద్ధంగా విస్తరించింది. ఈ విస్తరణ సమాజాల్లో ఉద్భవించిన అవసరాలు, పరిస్థితులకు అనుగుణంగా జరిగింది. ఏపిమాస్ ఎల్లప్పుడూ సమాజాల అవసరాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా, వాటికి సంబంధించి పనిచేస్తూ వచ్చింది. ముఖ్యంగా మహిళలు, చిన్న, సన్నకారు రైతులు, అలాగే షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, మారుమూల ప్రాంతాల్లో నివసించే ప్రజల వంటి సమాన అవకాశాలు లేని వర్గాలపై ఏపిమాస్ ప్రత్యేక దృష్టి సారించింది. వివిధ కార్యక్రమాల ద్వారా ఈ వర్గాల వరకు చేరుకొని, వారి అవసరాలు, జీవన పరిస్థితులకు అనుగుణంగా కార్యక్రమాలను సహజసిద్ధంగా రూపకల్పనచేసి, అమలు చేస్తూ వచ్చింది." ■

# 25 వసంతాలు ... 25 కీలక ఘట్టాలు !

**స్వ**యం సహాయ సంఘాల బలోపేతం నుండి జాతీయ విధాన రూపకల్పన వరకు, సంస్థల నిర్మాణం నుండి వ్యాపారాభివృద్ధి వరకు, జీవనోపాధి కార్యక్రమాల నుండి వాతావరణ అనుకూల అభివృద్ధి వరకు ఏపిమాస్ ఎల్లప్పుడూ ప్రజా ఆధారిత, స్థిరమైన అభివృద్ధికి ప్రేరక శక్తిగా నిలిచింది. ఆ ప్రస్థానంలోని ముఖ్య విశేషాలను చూద్దాం ....




1. **2001: ప్రస్థానానికి శ్రీకారం:** స్వయం సహాయ సంఘాల ఉద్యమాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఏపిమాస్ ఆంధ్రప్రదేశ్ సొసైటీల చట్టం కింద అధికారికంగా నమోదు చేయబడింది. చిన్న ప్రయత్నంగా ప్రారంభమైన ఈ సంస్థ, నేడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్ రాష్ట్రాలలో 4.7 లక్షలకు పైగా కుటుంబాల జీవితాలను ప్రభావితం చేస్తున్న శక్తివంతమైన అభివృద్ధి సంస్థగా ఎదిగింది.

2. **2002: 'మహిళా సాధికారత' మాసపత్రిక ఆవిర్భావం:** మహిళల సాధికారత, పేదరిక నిర్మూలన లక్ష్యాలతో ఏపిమాస్ 'మహిళా సాధికారత' అనే తెలుగు మాసపత్రికను ప్రారంభించింది. గత 24 ఏళ్ళుగా, క్రమం తప్పకుండా ఈ మాసపత్రిక ప్రచురితమవుతున్నది. ఈ పత్రిక గ్రామీణ మహిళల స్వరంగా నిలిచింది.

3. **2002: అంతర్జాతీయ భాగస్వామ్యాలకు నాంది:** ఎఫ్‌సీఆర్ఏ నమోదు పొందడం ద్వారా యూరోపియన్ యూనియన్, డీజీఆర్‌వీ జర్మనీ, గేట్స్ ఫౌండేషన్ వంటి అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పడి, ప్రపంచ వనరులను గ్రామీణ భారత సంస్థలకు అనుసంధానించే అవకాశాలు కలిగాయి.

4. **సంస్థల నిర్మాణంలో కీలక పాత్ర:** 'గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ' (సెర్ప్) స్వయం సహాయ సంఘాల మద్దతు వ్యవస్థగా, స్వతంత్ర సంస్థగా రూపుదిద్దుకోవడంలో ఏపిమాస్ కీలక సహకారం అందించింది. అదేవిధంగా పట్టణ పేదరిక నిర్మూలన కోసం ఏర్పడిన 'మెప్మా' ఆవిర్భావానికి కూడా తోడ్పడింది.

5. **రేటింగ్ , గ్రేడింగ్‌లో జాతీయ ప్రమాణాలు:** స్వయం సహాయ సంఘాలు, సమాఖ్యలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థల కోసం సమగ్ర రేటింగ్, గ్రేడింగ్ సాధనాలను అభివృద్ధి చేసి, దేశవ్యాప్తంగా 500కు పైగా సమాఖ్యలు, సహకార సంఘాలను వృత్తిపరంగా బలోపేతం చేసింది.

6. **2004--2012: జీవనోపాధులు,వాటర్‌షెడ్ :** సూక్ష్మ ఆర్థిక సేవలకు పరిమితం కాకుండా, జీవనోపాధుల అభివృద్ధి , సహజ వనరుల నిర్వహణ రంగాల్లోకి అడుగుపెట్టి, యూరోపియన్ యూనియన్ , ఆగా ఖాన్ ఫౌండేషన్ మద్దతుతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలో ఆరు భారీ వాటర్‌షెడ్ ప్రాజెక్టులను అమలు చేసింది.

**ఆశయం వుండీ , సాధించాలన్న తపన లేకున్నా బతికివుండీ చచ్చిన వారితో సమానమే**

**7. స్వయం నియంత్రణ ఉద్యమం :** డీజీఆర్‌వీ జర్మనీతో 17 సంవత్సరాల భాగస్వామ్యంతో, స్వయం సహాయక సంఘాల వ్యవస్థలో స్వీయ నియంత్రణను ప్రోత్సహించే నమూనాను రూపొందించి, 18 భాగస్వామ్య సంస్థల ద్వారా 10 రాష్ట్రాలకు విస్తరించింది.

